ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శుక్రవారం 10 జూలై 2026

## ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యేక దృష్టి సారించాం

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, జూలై 9, ప్రభాతవార్త :**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.గురువారం దేశ రాజధాని నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ బోర్డు సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, సంయుక్త కలెక్టర్ డా. నిధీ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, కడప ఆర్డీవో మురళి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని తెలుపుతూ.. జిల్లాలో 18,96,231 మంది ఓటర్లు, 2,251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గణన పత్రాల పంపిణీ 99.76 శాతం, డిజిటలీకరణ 71.42 శాతానికి చేరుకుందన్నారు. ప్రక్రియ వేగవంతానికి 54 మంది అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి, గ్రామ, వార్డు సచివాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

## పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించండి



**పీలేరు, జూలై 9 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాయచోటి డివిజనల్ డెవెలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు స్వర్ణ గ్రామ పంచాయతీ ఆన్లైన్లో చెల్లించాలన్నారు. పట్టణంలో 24 ఆర్వో వాటర్‌ంట్లు ఉన్నాయని, అందులో 21 ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. మూడు మరమ్మతులకు గురయ్యాయని. వాటిని కూడా వాడకంలోకి తెస్తామన్నారు. సర్ కార్యక్రమంలో అందరూ పాల్గొని గడువులోపు సర్వే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ప్రత్యేకాధికారి యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసీమలే దేశానికి
# పట్టుకొమ్మలు



కొల్లావారిపల్లెలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

### టిడిపి హయాంలోనే గ్రామాల అభివృద్ధి
### టిడిపి ఇన్చార్జ్ జగన్‌మోహన్ రాజు

**రాజంపేట, జూలై 9, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాలే దేశానికి పట్టుకొమ్మ లని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. గురు వారం మండలంలోని కొల్లావారిపల్లె మిట్ట హరిజనవాడల్లో పర్యటించారు. హరిజనవాడలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిం చారు. అనంతరం ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే కూటమి లక్ష్యం అన్నారు.దేశానికి పట్టుకొమ్మలైనటువంటి గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వైసీపీ నాయకులు రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశా రని, గ్రామాలలో వర్గ రాజకీయాలను ప్రోత్స హించి పబ్బం గడుపుకు న్నారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సి.సి రోడ్ల నిర్మాణంతోపాటు వాటర్ ప్లాంట్ లు, రక్షిత మంచినీటి ట్యాంకులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.మిట్ట హరిజన వాడలో ఆలయ నిర్మాణం కూడా చేపడతామని తామే దగ్గరుండి విగ్రహ ప్రతిష్టాపన చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న తెలుగుదేశం పార్టీని ప్రతి ఒక్క రూ ఆదరించాలని చమర్తి జగన్‌మోహన్‌రాజు కోరారు. అంతకు ముందు తిప్పన జంగయ్య ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన మన్నెం పెద్ద ఓబయ్య,గుడిసె హరినాథ్ జి వెంకటసుబ్బయ్య జంబు చంద్రశేఖర్ సుబ్బరాయుడు,మహిళలు, 40 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి జగన్ మోహన్ రాజు సాదరంగా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, పార్టీ మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి,మండల అధ్య క్షులు రవికుమార్ నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బ రాజు, సీనియర్ నాయకులు పత్తిపాటి రవి,నాగినేని నాగేశ్వరరావు నాయుడు, సురేందర్ నాయుడు, మాజీ ఉపసర్పంచ్ మేక నరసింహులు, గ్రామ అధ్యక్షులు నాగినేని పవన్ కుమార్,డైరెక్టర్ పరుశురాం



మిట్ట హరిజనవాడలో తెలుగుదేశం పార్టీలో చేరిన 40 కుటుంబాలు

### మహిళలు, చిన్నారుల భద్రతకు
## అధిక ప్రాధాన్యమివ్వాలి

### జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**గుర్రంకొండ, జులై 9, ప్రభాతవార్త:**

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. గురువారం గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, పెండిగ్ కేసులు, మహిళలు మరియు చిన్నారులకు సంభందించిన ఫిర్యాధుల నమోదు, విచారణలకు సంబందించిన ఫిర్యాదుల నమెదు, విచారణ పురోగతిని కలెక్టర్, ఎస్పీ సమీక్షించారు. మహిళలభద్రతకు సంబందించిన ప్రతి ఫిర్యాధును అత్యంత భాధ్యతతో స్వీకరించి, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఐవిఆర్ఎస్ కాల్స్ నిర్వహణలో మరింత పురోగతి సాధించాలని, కాల్స్ ద్వారా అధిక పిర్యాధులను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే బాదితుల ఇళ్లకు వెల్లి సమస్యలను తెలుసుకొని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు, ఫోక్సో కేసుల విచారణకు ప్రత్యేక దృష్టి సాధించాలని, త్వరితగతిన న్యాయం అందేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళా పోలీసుల గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో మహిళలు, బాలికలు, చిన్నారులకు భద్రత, చట్టాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాధు దారులతో సత్వర సేవలు చేపట్టాలని సూచించారు. భాధితులపై నిర్వక్ష్యంగా వ్యవహరిస్తే తమకు నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి కృష్ణమోహన్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాఘవరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే
# తొలి ప్రాధాన్యం

### ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల, జూలై 9, ప్రభాతవార్త**

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పులివెందులలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని ఓపికగా ఆలకించిన ఎంపీ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రజా దర్బార్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పులివెందులలో జరిగిన పలు వివాహ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా, ఆయురా రోగ్యాలతో, సుఖసం తోషాలతో కొనసాగాలని ఆకాంకించారు.ఈ సందర్భంగా వివాహ వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రతి శుభకార్యంలో భాగస్వామ్యం కావడం తనకు ఆనందంగా ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..!

### ఎన్‌కార్డ్ సమావేశంలో కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ స్పష్టం



**కడప, జూలై, ప్రభాతవార్త :**

మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టి కడప జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లు సంయుక్తంగా అధికారులను ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా మాదకద్రవ్యాల సమన్వయ కేంద్రం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరై.. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, ఎక్సైజ్, విద్య, అటవీ, వ్యవసాయ, రవాణా, స్థానిక సంస్థలు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల సమన్వయ కేంద్రం బహుళ శాఖల సమన్వయ వ్యవస్థగా.. మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణా, విక్రయం, వినియోగం వంటి అంశాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, విద్య, అటవీ, రైల్వే, ఆరోగ్య తదితర శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్‌కార్డ్ సమావేశాలు నిర్వహించడం, ప్రత్యేక ప్రణాళికలతో డ్రగ్స్ వాడుక నియంత్రణకై విస్తృత చర్యలు చేపడుతున్నామన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. వినియోగదారులను గుర్తించేందుకు పరీక్షా పరికరాలను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 581 ఈగిల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కళాజాత బృందాల ద్వారా 283 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో విశేష ఫలితాలు సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా అవగాహన కార్యక్రమాల నిర్వహణలో కడప జిల్లా ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ... మన జిల్లాలో 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 83 మాదకద్రవ్యాల కేసులు నమోదు చేసి, 263 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో 185 కిలోల గంజాయి, 2,006 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.జిల్లాలో 170 మాదకద్రవ్యాల వినియోగ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో సురక్షిత విద్యాలయ ప్రాంతం కార్యక్రమం కింద విస్తృత తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన పాన్ మసాలా, చిరు దుకాణాలపై 1,628 కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు వివరించారు.గంజాయి అక్రమ రవాణా, సాగును అరికట్టేందుకు ప్రతిరోజూ డ్రోన్ నిఘా, జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో పోలీసు-రైల్వే సంయుక్త తనిఖీలు, ఏడు ప్రాంతాల్లో డైనమిక్ తనిఖీ కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేక డీకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు

### హాస్టల్ నిర్వహణపై ప్రశంసలు
### ప్రిన్సిపాల్, కేర్‌టేకర్‌కు అభినందనలు



స్టాక్ నీ పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్ లలిత

**పులివెందుల, జూలై 9, ప్రభాత వార్త :**

రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు జి. దేవి గురువారం కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హాస్టల్, వంటశాల, స్టోర్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత తదితర అంశాలను తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రం గా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేసిన లలిత, ఇదే విధంగా నిర్వహణను కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్న ప్రిన్సిపాల్ సి. నరసింహులు, కేర్‌టేకర్ బి. మల్లారెడ్డిలను రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, రెసిడెన్షియల్ హాస్టల్స్ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొ న్నారు. కార్యక్రమం ముగింపులో ప్రిన్సిపాల్ సి. నరసింహులు రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు జి. దేవిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## హనుమాన్ వాహనంపై విహరించిన శ్రీవారు





వార్త 2వ పేజీలో

## మూడు రోజులుగా గుర్తుతెలియని మృతుడి మిస్టరీ వీడింది

### సోషల్ మీడియా ప్రకటనతో ముందుకొచ్చిన బంధువులు
### మృతుడు అనంతపురం జిల్లాకు చెందిన రాజేష్‌గా గుర్తింపు



**పులివెందుల, జూలై 9, ప్రభాత వార్త :**

పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న రాజేష్ (30) మృతదేహం విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. అర్బన్ సీఐ శ్రీరామ్ సోషల్ మీడియా ప్రకటనతో స్పందించిన బంధువులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మృతుడి వివరాలను వెల్లడించారు. అర్బన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం, రాజేష్ అనారోగ్యానికి గురికావడంతో జూన్ 25న కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారని చికిత్స పొందుతూ జూలై 3న మృతి చెందాడని అయితే అతని బంధువులు లేదా పరిచయస్తులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మృతుడి వివరాలు తెలియజేయాలని ఆసుపత్రి వర్గాలు కేసుస్టడీ లో వున్నా సమాచారంతో విషయాన్ని పోలీస్ స్టేషన్ కి చేరావేయడం తో సమాచారం కోరుతూ అర్బన్ పోలీస్ స్టేషన్ తరపున సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు.ఈ ప్రకటనను గమనించిన బంధువులు వెంటనే అర్బన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మృతుడి వివరాలను పోలీసులకు అందించారు. రాజేష్ స్వస్థలం అనంతపురం జిల్లా అని, అతనికి తల్లిదండ్రులు లేరని, పులివెందులలో నివసిస్తున్న బంధువుల వద్దకు వచ్చి రాజారెడ్డి కాలనీలో అద్దె ఇంటిలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని తెలిపారు.ఇటీవల మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించిందని, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించినట్లు బంధువులు వెల్లడించినట్లు సీఐ శ్రీరామ్ తెలిపారు. దీంతో మృతుడి పూర్తి వివరాలు నిర్ధారణ కావడంతో కేసుకు సంబంధించిన సందిగ్ధత తొలగినట్లు ఆయన పేర్కొన్నారు.

## 10వ తేదీలోపు సర్ ఎన్యూమరేషన్ ఫారంలను పూర్తి చేయాలి

### ఆర్టీవో శ్రీనివాస్



**రామాపురం జూలై 9 ప్రభాతవార్త:**

సర్‌కు సంబంధించి బి ఎల్ వో లు ఎన్యూమరే షన్ ఫారంను డిజిటలైజేషన్ చేసి శుక్రవారం లోపు పూర్తి చేయాలని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ. ప్రతి పోలింగ్ స్టేషన్లో జరుగుతున్న ఎన్యూమరే షన్ ఫారాల ను డిజిటలైజేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు. అన్ని గ్రామాలలో జరుగుతున్న ఓటర్ జాబితా కార్యక్రమాన్ని అయన పరిశీలించారు. బిఎల్ఎ లు బిఎల్ఓ లకు సహకరించి ప్రతి ఓటరు తమకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారంను బిఎల్ఓలకు సమర్పించాలని తెలిపారు. బిఎల్ఎ లు అందరూఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓలకు చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. మండల వ్యాప్తంగా 75/ శాతం చేశారని అన్నారు. ఎన్యూమరేషన్ పారం లు త్వరలో పూర్తి చేయాలని తాసిల్దార్‌కు ఎంపీడీవోలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటేశులు ఎంపీడీవో జాషువా మండల సర్వేయర్ వాసుదేవ రెడ్డి ఆర్ఐ సమర్ద్ ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి గారూ! సూపర్ సిక్స్ హామీలలో మిగిలిపోయిన
## హామీల అమలు ఎప్పుడు?

### డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



**వేంపల్లి, జూలై 09 ప్రభాతవార్త:**

సూపర్ సిక్స్ హామీలలో ఇప్పటివరకు అమలు కాకుండా ఉన్న, మిగిలిపోయిన హామీలను ఎప్పటినుండి అమలు చేస్తారని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణమని అన్నారు.ఈ హామీలను నమ్మి ప్రజలు కూటమి పార్టీలకు ఓట్లు వేశారు.కూటమి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయింది. కానీ ఇప్పటివరకు సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన నిరుద్యోగ భృతి,ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే సామాజిక పెన్షన్ హామీలు అమలు కావడం లేదు . ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న, దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న రీతిలో కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తూ ఉండడం శోచనీయమని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. నిరుద్యోగ భృతి. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడం జరిగింది.అధికారంలోకి వచ్చి 25 నెలలు దాటింది.ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు. ఒక్కొక్క నిరుద్యోగికి 75 వేల రూపాయల వరకు ప్రభుత్వం బకాయి పడింది. కర్ణాటక, ..మిగతా 2పేజీలో

## సామాజిక చైతన్యంపై ప్రత్యేక అవగాహన



వార్త 4వ పేజీలో

# ప్రజా సమస్యలపై తక్షణమే చర్యలు చేపట్టండి : జడ్పీటిసి

**వేంపల్లె జూలై 09 ప్రభాతవార్త**

మండలంలోని ప్రజల సమస్యలపై అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ సభ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, ఆరోగ్యం, సిజనల్ వ్యాధులపై అధికారులు చొరవ చూపి పరిష్కార చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతులు, ఇతరత్రా వాటిపై మెడికల్ ఆఫీసర్ జోయల్ వెస్లీ తో జడ్పీటిసి ఆరాతీసారు. నియోజకవర్గంలోనే వేంపల్లె మండలం అధిక జనాభా కలిగి ఉందని, వైద్యం కోసం వచ్చే ప్రజల పట్ల శ్రద్ధ వహించాలని, వీరికి సేవలందించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని జడ్పీటిసి సూచించారు. అంతేకాకుండా సిజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా గత 6 నెలల నుంచి విద్యుత్ శాఖలో రెగ్యులర్ ఏఇ లేనందున రైతులు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వీటిపై జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సభాముఖంగా జడ్పీటిసి విన్నవించారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారికి జడ్పీటిసి సూచించారు. ప్రధానంగా పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో




అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్సై తాహిర్ హుస్సేన్ కి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగి ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ని జడ్పీటిసి సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మండల వ్యాప్తంగా దాదాపు 70 శాతం మేర పూర్తి కావోస్తోందని తహసీల్దార్ శివశంకర్ రెడ్డి వెల్లడించారు. ఓటు తొలగింపుపై ఎలాంటి అపోహాలు పడోద్దని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గడువులోగా ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేసి బిఎల్ఓ లకు అందజేయాలని కోరారు. లేని పక్షంలో ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తా : చైర్మన్



**సిద్ధవటం, జూలై, 9 ప్రభాతవార్త :**

సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా శ్రీలేఖ, వైస్ చైర్మన్గా పార్ల సంజీవ రాయుడు 13 మంది డైరెక్టర్ల చేత వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుజాత మండల కేంద్రమైన సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, చమర్తి జగన్మోహన్ రాజు జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్బంగా టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం తప్పదని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యులు ముద్దు కృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు జయకృష్ణ టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్, యాదవ్ గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వి రమణ క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి, బొబ్బిలి రాయుడు,మాజీ సర్పంచులు భవనాసి ఓబులయ్య లింగంపల్లి వెంకటేశ్వర్లు పోలిశెట్టి శ్రీనివాసులు ఏఎంసీ డైరెక్టర్స్ షేక్ మహబూబ్ బాషా, కృష్ణ యాదవ్ యాదవ్ గంగా నందా రెడ్డి బంట్రోతు వెంకటరమణ బి రామకళ జింక లక్ష్మీదేవి నిమ్మకాయల లక్ష్మీదేవి విద్య కమిటీ మాజీ చైర్మన్ మునిస్వామి పసుపులేటి గంగయ్య విజయ్ మైనార్టీ నాయకులు కూల్ డ్రింక్స్ గౌస్ భాష ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు పార్ల రాం ప్రసాద్ కూటమి నేతలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ మూడు నెలలు పొడిగించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**

సర్ ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం మురళీ అధ్యతన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి రామానాయుడు పాల్గొని ప్రసంగించారు. సర్ ప్రక్రియను మూడునెలలు పెంచాలని, రావాణ్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా విమర్శించారు. ప్రభుత్వ విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించే వారిపై త్రీవమైన కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. విమర్శలను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి పోలీసు వ్యవస్థను ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేయడం సబబు కాదన్నారు. ఇలాంటి రాజకీయ కక్షసాధింపుతో కొనసాగుతున్న వేధింపులను నిలపివేయాలని రామానాయుడు డిమాండ్ చేశారు. ఇక 5రోజుల్లో సర్‌ప్రకియ ముగుస్తుండడంతో మూడునెలలు గడువును పెంచాలని డిమాండ్ చేశారు. బిఎల్ఓలు గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా అటువంటి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టలేదన్నారు. జిల్లా కలెక్టర్లు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టాలన్నారు. గతంలో ఓటు నమోదుకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు పాస్‌పోర్టు వంటివి ప్రామాణికంగా ఉండేవని ఇప్పుడు ఇవేమి పనికిరావని రావంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 15వరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వంపైన సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమానికి పులుపు నిస్తూ ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్, తోపు క్రిష్ణప్ప, జనార్ధన్, సాంబశివ, మనోహర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో భాగాస్వాములు కండి

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



సర్ ప్రక్రియలో పాల్గొన్న నాయకులు

**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**

సర్ ప్రక్రియలో బిఎల్‌ఓలతో పాటు బిఎల్‌ఏలు బాగస్వాములై వేగవంతంగా నిర్వహించాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. ప్రజల సమస్యలపై నిస్సార్‌అహ్మద్ వచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి తహశీల్దార్‌తో సమీక్ష సమావేశంనిర్వహించారు. పట్టణంలోని స్థానిక వైకాపా కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ సర్ ప్రక్రియకు సంబందించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఓటర్లు పాల్గొన్నారు. ఇందులో ఓటరు నమోదు, సవరణ, మ్యాపింగ్ వంటి వివరాలు, సమస్యలను తెలియజేశారు. నిస్సార్‌అహ్మద్ సబ్‌కలెక్టర్ సూనల మేరకు పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీలో తహశీల్దార్ మాదవితో కలసి సర్ ప్రకియను పరిశీలించారు. దీనపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలుపై అధికారులతో సమగ్రంగా సమీక్షించి పరిష్కరించారు. సర్ ప్రక్రియపై ఎలాంటి సమస్య ఉన్నా నా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్వి విఎస్.రెడ్డి, కరీముల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొత్తపల్లి మహేష్, మహబూబ్‌బాషా, మస్తాన్, సలీం, ఫయాజ్‌ఖాన్, నవీద్ బాయమ్మ,బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

## డిఎస్‌పి చంద్రశేఖర్‌కు సన్మానం



డిఎస్‌పిని కలిసిన చలపతి, మస్తాన్‌లు

**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లా క్రైమ్ బ్యాంచ్ సిఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌కు డిఎస్‌పిగా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో గురువారం కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, బివైఎస్ పునీత్‌కుమార్, చిరు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ చంద్రశేఖర్ తన సేవాభావం, క్రమశిణ, సమర్థవంతమైన పనితీరుతో ఈ పదోన్నతిని పొందారని తెలిపారు. డిఎస్‌పిగా మరింత ఉన్నత స్థాయిలో ప్రజలు సేవలందించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవలందించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్తితికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## కెంపెగౌడ 517వ జయంతిని జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**

జూన్ 12న బి.కొత్తకోటలో జరుగు కెంపెగౌడ 517వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆసంఘ ప్రతినిధులు గురువారం పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్బంగా సంఘ ప్రతినిదులు మాట్లాడుతూ ఈనెల 12న ఆదివారం ఉదయం 10గంటలకు బి.కొత్తకోటలోని పిటిఎం రోడ్డు రాజాపంక్షన్ హాలు నుంచి బైక్ ర్యాలీని నిర్వహిస్తామని ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు. అనంతరం పిటిఎం రోడ్డు నుంచి జ్యోతిచౌక్ మీదుగా ఏకే పంక్షన్‌హాలులో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి వి.గోపాల్‌గౌడ్, శ్రీనివాసపురం ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి, కర్నాటక రాష్ట్ర మెరుసుకాపు సంఘం కార్యదర్వి కోనపరెడ్డి తదితరులు హజరు కానున్నట్లు తెలిపారు. కావున ఈ సమావేశాన్ని ప్రతి ఒక్క మెరుసుకాపు సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## గర్భవంతులకు వైద్య పరీక్షలు

**నందలూరు జూలై 09 ప్రభాతవార్త :**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంయస్ ఎమ్ఎ కార్యక్రమం పురస్కరించుకొని 30 మంది గర్భవతులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ తీయడం జరిగినది అని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రవైద్యాధికారి డాక్టర్ కె. శరత్ కమల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రాజంపేటలోని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్వచ్ఛందముగా నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భతులకు స్కానింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. వైద్య పరీక్షలు హాజరైన గర్భతులకు డాక్టర్ మస్తానమ్మ ఆహారం కూడా అందచేయడం జరిగిందని అన్నారు . డాక్టర్ మస్తానమ్మ కి డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ డి. కార్తీక్ విశ్వనాథ్ గర్భవంతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సి హెచ్ ఓ వెంకట నారాయణ, పి హెచ్ ఎన్ శైలజ, సూపర్వైసర్లు హిమశంకరి, సునీల్, హెల్త్ అసిస్టెంట్ మధు, ఎం ఎల్ హెచ్ పిలు, ఏ ఎన్ ఎమ్స్, ఆశా కార్యర్తలు పాల్గొన్నారు.

## వైయస్సార్ పాలన స్వర్ణ యుగం..




**కడప కార్పొరేషన్ జూలై 9 ప్రభాతవార్త:**

2004, 09 వైయస్సార్ పాలన స్వర్ణ యుగమని గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్. బిహెచ్ కొనియాడారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి గల్ఫ్ దేశాలు ఘనంగా నిర్వహించారనీ పేర్కొన్నారు. కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కువైట్‌లో, దుబాయ్ యూఏఈ లో సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో, సోమిరెడ్డి యూఏఈ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, జీసీసీ కోకన్వీనర్ మహమ్మద్ జిలాన్ బాషా, గోదావరి రెస్టారెంట్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో, దోహా ఖతార్ లో పితాని శీను, అబ్దుల్ అలీమ్ సహకారంతో గల్ఫ్ కో కన్వీనర్ డి. శశికిరణ్, ఖతర్ కన్వీనర్ జాఫర్ హుసేన్ ఆధ్వర్యంలో సౌదీ అరేబియా సెంట్రల్, రియాద్ కన్వీనర్ డా. రబ్బానీ ఆధ్వర్యంలో, ఈస్ట్ ప్రవిసెన్స్ సౌదీ అరేబియా జుబైల్ కన్వీనర్ షేక్ ఇలాహి ఆధ్వర్యంలో వైయస్సార్ జయంతినీ ఘనంగా నిర్వహించారు.

## యువకుడు అదృశ్యం - కేసు నమోదు

**ప్రొద్దుటూరు క్రైం, జులై 9, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటకు చెందిన బోడిచెర్ల శివరమేష్ (19) కనిపించడం లేదని యువకుడి తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు 8వ తేదీ రాత్రి యువకుడి తండ్రి చంద్రశేఖర్ శివరమేష్‌ను చదువుకోవాలని మందలించడంతో మనస్తాపానికి గురైన శివరమేష్ ఇంట్లోని బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. ఈ మేరకు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు సీఐ నంబరు 912110 0586, చంద్రశేఖర్ 8500520679 నంబరును సంప్రదించాలన్నారు.

## ప్రశ్న రావణ్ అరెస్టులపై విమర్శలు

**బద్వేలు, జూలై 9, ప్రభాతవార్త**




ప్రశ్న రావణ్‌పై వరుస కేసులు నమోదు చేసి పలుమార్లు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం బద్వేలు భగత్‌సింగ్ నగర్‌లో జరిగిన పార్టీ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విమర్శించే హక్కు, ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులని పేర్కొన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలు నిలిపివేసి, ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి, యువజన ఉద్యమాలపై నిర్బంధ చర్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కే. జకరయ్య, రామరాజు, జయరామరాజు, బాబు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంతో రాజీ పడొద్దు

**పులివెందుల, జులై 9, ప్రభాతవార్త :**




నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాల నాణ్యతపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఏఎస్ వైఎఫ్, రాష్ట్ర అధ్యక్షుడు ఓబయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దినేష్ డిమాండ్ చేశారు.గురువారం పులివెందులలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిటీ సభ్యురాలు జి. లలిత కలిసి ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులను కలిసి ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఆహార భద్రత అంశాన్ని అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలావినియోగమవుతున్నాయా అనే అంశాన్ని పారదర్శకంగా పరిశీలించాలని కోరారు. తనిఖీల్లో లోపాలు, అవకతవకలు లేదా నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రతి విద్యార్థికి ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ప్రభుత్వం అమలు చేయాలని ఏఎస్ వైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## గర్భిణీలు బలవర్ధక ఆహారాన్ని తీసుకోవాలి



**బ్రహ్మంగారిమఠం జూలై 09 ప్రభాతవార్త**

గర్భిణీలు కడుపుతో ఉన్న సమయంలో బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని గైనకాలజిస్ట్ మోనికారెడ్డి సూచించారు.ప్రతినెల 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పిఎంఎస్ఎంఎప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ సంపత్ కుమార్ ఆహ్వానం మేరకు గర్భిణీలకు పరీక్షలు నిర్వహించేందుకై కడపలోని ధ్రువ హాస్పిటల్ నుంచి స్వచ్ఛందంగా గైనకాలజిస్ట్ డాక్టర్ మోనికారెడ్డి బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు ముఖ్యంగా రక్తహీనతను పెంపొందించేందుకై ఐరన్ మాత్రలు వాడాలని,ఇవి మనం తిను ఆహారంలోకి బెండకాయలను చేర్చుకోవాలని,అలాగే బెల్లంతో తయారు చేయు వేరుశనగ ముద్దలను తినాలని సూచించారు. అలాగే పాలు,గుడ్లు,ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె తెలియజేశారు. ఏదైనా సమస్యలు వచ్చిన వెంటనే స్థానిక వైద్యశాలకు వచ్చి డాక్టర్ సలహాతో మందులను తీసుకోవాలని ఆమె సూచించారు.అలాగే స్థానిక డాక్టర్ సంపత్ కుమార్ గర్భిణీలకు పౌష్టికాహారమైన గుడ్డును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్సీ డాక్టర్ సంపత్ కుమార్,హెల్త్ అసిస్టెంట్లు మాధవ, వెంకటరెడ్డి, సిహెచ్వోలు, ఆశ వర్కర్లు, మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ

**పెండ్లిమర్రి, జులై 9, ప్రభాతవార్త:**

మండలంలోని పెండ్లిమర్రి హైస్కూలు కస్తూర్బా పాఠశాల, నందిమండలం హైస్కూలు, అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం ఏపీ ఫుడ్ కమిషనర్ సభ్యురాలు దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి కస్తూర్బా పాఠశాలలో కూరగాయలు సరిగా లేవని, బియ్యంలో పురుగులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందిమండలం హైస్కూలులో మధ్యాహ్న భోజనం సరిగా లేదని అక్కడి సిబ్బందిపై మండిపడ్డారు. సిబ్బంది, ఉపాధ్యాయులకు సూచనలు చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవి, సివిల్ సప్లయ్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకుడాలలో శోకసంతప్త

## కుటుంబానికి బీటెక్ రవి పరామర్శ

**పులివెందుల, జులై 9, ప్రభాతవార్త :**

నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గంగిరెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీటెక్ రవి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన బాబు రెడ్డి, దుష్యంత్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన ఆయన, స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యలను స్వయంగా తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, లింగాల మండల సొసైటీ అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, పుష్పానాథ్ రెడ్డి, గురవిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న బీటెక్ రవి

## గ్రామీణ యువత ఉపాధికి లయోలా-మ్యాజిక్ బస్ జోడీ

**పులివెందుల, జులై 9 ప్రభాతవార్త :**



గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు పులివెందులలోని లయోలా డిగ్రీ కళాశాల వైఎస్ఆర్ఆర్ మరియు ప్రముఖ సామాజిక సేవా సంస్థ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నా రు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తృతీయ సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి మ్యాజిక్ బస్ ప్రతినిధులు ప్రసంగించి, ప్రస్తుత ఉద్యోగ రంగంలో నైపుణ్యాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం సంస్థ బృంద సమన్వయకర్త, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీమతి పుష్పలత మరియు లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఫా. డా. ఎల్. జోజి రెడ్డి, ఎస్.జే. అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. మ్యాజిక్ బస్ ప్రతినిధులు కూడా కళాశాల యాజమాన్యం, అధ్యాపక వర్గం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థులను ఉద్యోగ విపణిలో పోటీతత్వానికి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు అత్యుత్తమ శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు.

## పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించండి.

**పీలేరు జూలై 9 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాయచోటి డివిజనల్ డెవెలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీ ...మపతి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు స్వర్ణ గ్రామ పంచాయతీ ఆన్లైన్లో చెల్లించాలన్నారు. పట్టణంలో 24 ఆర్వో వాటర్ంట్లు ఉన్నాయని, అందులో 21 ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. మూడు మరమ్మతులకు గురయ్యాయని. వాటిని కూడా వాడకంలోకి తెస్తామన్నారు. సర్ కార్యక్రమంలో అందరూ పాల్గొని గడువులోపు సర్వే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ప్రత్యేకాధికారి యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీడర్లలో లైన్ల మరమ్మతులు

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మైదుకూరు, జులై 09,ప్రభాతవార్త:**

33కేవీ నంద్యాలంపేట, ఖాజీపేట మరియు లెక్కలవారిపల్లి ఫీడర్లలో లైన్ల మరమ్మతులు చేపట్టనున్నందున రేపు ఉదయం 07:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. విద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు ఖాజీపేట మండలం,మైదుకూరు మండలం లోని నంద్యాలంపేట, కూడలి, ఉప్పగుంటపల్లి, ముక్కొండ, లెక్కలవారిపల్లి మరియు వనిపెంట సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు పై సమయంలో పై ప్రాంతాల వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదు. కావున ప్రజలు, రైతు సోదరులు గమనించి, విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా శ్రీకాంత్ సబ్ డివిజన్ అధికారి తెలియజేశారు.

## నాణ్యత గల విత్తనాలు విక్రయించాలి



**దువ్వూరు, జులై 09, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రైతులకు విత్తనాల దుకాణాదారులు నాణ్యత గల విత్తనాలను మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన దువ్వూరులోని పలు విత్తన దుకాణాలను ఆయన పరిశీలించారు. విత్తన దుకాణాల్లోని మినుము, పెసర, వరి, నూగు వంటి విత్తనాలను పరిశీలించి వాటి శాంపిల్స్ సేకరించారు. వాటిని ప్రయోగశాలకు పంపుతామని, మొలక శాతం ఎంత ఉందనే విషయాన్ని బట్టి నాణ్యత పరిశీలిస్తామన్నారు. 90 శాతానికి తక్కువగా ఉంటే విత్తన కంపెనీల పై అలాగే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు అమ్మే సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. శాంపిల్స్ ను సేకరించి వాటిని విశాఖపట్నం ల్యాబ్ కు పంపుతున్నట్లు తెలిపారు.

## పార్టీ బలోపేతం, ప్రభుత్వ

## సంక్షేమ పథకాల ప్రచారంపై దిశానిర్దేశం



**పులివెందుల, జులై 9, ప్రభాతవార్త :**

పులివెందుల నియోజక వర్గంలోని తొండూరు మండలంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పులివెందుల టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని బలోపేతం చేసేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. బీటెక్ రవి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు తోడ్పడాలని అన్నారు. ఈ సమావేశంలో తొండూరు మండల క్లస్టర్ ఇంచార్జ్ కంచిరెడ్డి, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామసూరా రెడ్డి, తొండూరు మండల సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, మల్లెల నాగిరెడ్డి, నాగ అంజనేయులు రెడ్డి, సుబ్బారెడ్డి, గవేంద్ర రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, భాస్కర్ రెడ్డి, గంగయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రాగునీరు అందక మహిళలకు ఇబ్బందులు

**సిద్దవటం జూలై 9 ప్రభాతవార్త**

త్రాగునీరు అందక మహిళలు పంట పొలాల్లోకి వెళ్లి త్రాగునీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు మండలంలోని చలమారెడ్డి పల్లె గ్రామం బీసీ కాలనీలో ఉన్న త్రాగునీటి బోరు చెడిపోయి 5 రోజులు కావస్తున్న మరమ్మత్తులు చేయలేదని త్రాగునీటి కోసం పంట పొలాలకు వెళ్తున్నామని మహిళలు ఈ సందర్బంగా ఆ ప్రాంతవాసులు గురువారం మాట్లాడుతూ త్రాగునీరు మోటర్ చెడిపోయి త్రాగునీరు అందడం లేదని పంట పొలాల కెళ్ళి త్రాగునీరు తెచ్చుకుంటున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారం చేయాలని తెలిపారు ఈ విషయమై పి కొత్తపల్లి పంచాయతీ సెక్రెటరీ లలిత వివరణ కోరగా త్రాగునీరు అందించే మోటార్ చెడిపోయిందని రెండు రోజుల సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు.

## ఓఆర్ఎస్ ద్వారా విరోచనాలు నివారణ



ఓఆర్ఎస్‌పై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణలత

**రాజంపేట, జూలై 9 ప్రభాతవార్త**

డయేరియా సమయంలో ఓఆర్ఎస్‌తో విరేచనాలు నివారణకు అవకాశం ఉంటుందని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. స్వర్ణలత పేర్కొన్నారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం బృందం ఆధ్వర్యంలో బోయినపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ఓఆర్ఎస్‌పి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అన్నమాచార్య ఫార్మసీ కళాశాల సిబ్బంది పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి ఎల్లారెడ్డి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ ఈ సాయి బాబా రెడ్డి,ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి స్వర్ణలత, కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి పి.ప్రదీప్ కుమార్, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి గిర్రా శేఖర్, ఇతర విద్యార్థిని బృందం పాల్గొని విద్యార్థులు ఓఆర్ఎఫ్ సొల్యూషన్‌తో విరోచనాల జబ్బులో ఎలా ఉపయోగించాలో తెలుపుతూ ఎంత మోతాదు నీటితో వాటిని కలపాలో అని పూర్తి అవగాహన కల్పించారు.

## తమ ప్రతిభను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చేయాలి

**వేంపల్లె జూలై 09 ప్రభాతవార్త**

విద్యార్థులు ఆయా ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సంపాదించి, తమ ప్రతిభను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చేయాలని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ్ ప్రకాష్ ఆకాంక్షించారు. గురువారం ఆర్కేవ్యాలి, ఒంగోలు క్యాంపస్‌లలో పియూసి పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా ఇంజనీరింగ్ విభాగాలు కేటాయించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి పలు సలహాలు సూచనలు చేశారు. ఉన్నతమైన స్థాయికి ఎదగాలంటే కొత్త తరహా నైపుణ్యాలతో రానించాలని, ప్రస్తుత పోటి ప్రపంచంలో తమ నైపుణ్యాలతో ముందుకెళ్లి ఆదర్శంగా నిలవాలని కోరారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో దేన్నైనా సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. తమ తల్లిదండ్రుల కలలకు సాకారంగా జీవిత పయణం కొనాసాగాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, దేశ రక్షణలో తమ పాత్రను పోషించాలని సూచనలు చేశారు. అలాగే పియూసిలో విద్యార్థులు పొందిన మార్కులు, రిజర్వేషన్, ఆప్షన్‌ల ఆధారంగా ఆయా విభాగాలను కేటాయించినట్లు అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.



## దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు విద్యాసామ్మాగ్రి పంపిణీ చేస్తున్న రాజేంద్రాచారి

**పీలేరు, జూలై 9 ప్రభాతవార్త:**

పేద విద్యార్థుల అభ్యున్నతికి దాతల సహకారం అభినందనీయమని హెచ్ఎం కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని శెట్టిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏబీసీ సంస్థ చైర్మన్ సుమలత, తండ్రి రాజేంద్రాచారి విద్యార్థులకు సుమారు విద్యాసామ్మాగ్రి వితరణ చేశారు. గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్లపై వాహనాలు పెడితే చర్యలు తప్పవు

**బద్వేల్ అర్బన్, జూలై 09 (ప్రభాతవార్త):**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్డులో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యపై బద్వేల్ అర్బన్ సీఐ రామకృష్ణ తక్షణమే స్పందించారు. ఈ మార్గంలో సిండికేట్ బ్యాంక్, ఎల్ఐసి ఆఫీస్, పాఠశాల, టింబర్ డిపో మరియు పలు గోడౌన్లు, షాపులు ఉండటం వల్ల నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. కొందరు వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా రోడ్లపైనే నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ లేదా ఫైర్ ఇంజన్ వెళ్లడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొనడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఆ ప్రాంతానికి చెందిన స్థానికులు షేక్ రియాజ్, మహమ్మద్ రఫీ, అఫ్రిద్, ఫయాజ్, సుహెబ్, నిషార్ తదితరులు బద్వేల్ అర్బన్ సీఐ రామకృష్ణను స్వయంగా కలిసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వారి ఫిర్యాదుపై వెంటనే స్పందించిన సీఐ రామకృష్ణ తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులకు, స్థానిక షాపుల యజమానులకు ఆయన పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఇకపై రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన గట్టిగా హెచ్చరించారు. నో పార్కింగ్ బోర్డులు అక్కడ త్వరలో ఏర్పాటు చేసి రోడ్ల పైన వాహనాలు నిలపకుండా ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే విధంగా కృషి చేస్తామని సిఐ రామకృష్ణ స్థానిక ప్రజలకు తెలియజేశారు, సిండికేట్ బ్యాంక్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యపై తక్షణమే సిఐ స్పందించి సంఘటన స్థలాన్ని చేరుకోవడంతో పలువురు స్థానిక ప్రజలు సీఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి

**వీరపునాయునిపల్లి జూలై 09 ప్రభాతవార్త**

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పొందేందుకు రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయధికారి శ్యామ్ బాబు రైతులను కోరారు. రైతులు మూడు రకాలుగా ఈ బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. బ్యాంకుల్లో రైతులు రుణం రెన్యువల్ ద్వారా చేసుకోవచ్చునన్నారు, కామన్ సర్వీసు సెంటర్ ద్వారా గాని లేదా రైతులు స్వయంగా ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పోర్టల్లో నమోదు చేసుకోవచ్చునన్నారు. రైతులు ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటప్పుడు 1బీ, ఆధార్ కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్, పంట సాగు చేసినట్టు స్వీయ ధ్రువీకరణ పత్రం, మొబైల్ నెంబరు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. శ్రీ.శి కడప జిల్లాకు ప్రధానమంత్రి ఫసల్ బీమా రబి 2026, 27 కు గాను Generali Central General Insurance Company LTD మరియు వాతావరణ ఆధారిత భీమా ఖరీఫ్ 2026 కు గాను IFFCO TOKIO వారిని నియమించడం అయినది.

## రాష్ట్ర జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**

మదనపల్లెలోని మిషన్‌కాంపౌండ్, గ్రీన్‌వ్యాలీ, వశిష్ట గ్రౌండ్స్‌ల్లో రాష్ట్ర జూనియర్ బాయ్స్ ఫుట్‌బాల్ చాంపియన్స్ పోటీలు ఈనెల 11, 12, 13తేదీల్లో జరగనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు మూడు మైదానాలను సిద్ధం చేశామని ఇందులో 26జిల్లాల నుంచి బాలుర చాంపియన్షిప్ నందు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 11నుంచి 13వరకు జరిగే ఈ పోటీలను పట్టణంలోని ఫుట్‌బాల్ క్రీడాకారులు పోటీలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేసన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రకళ, జాన్ కమలేష్, కోశాధికారి నరేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ మహేంద్రనాయక్, బాలాజి ఇర్షాద్, జిల్లా కోచ్ మౌలాళిలు పాల్గొన్నారు.

## దాతల సహాయం మరువలేనిది. ఎంఈఓ



విద్యార్థులకు సామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం.

**కురబలకోట, జులై 9 ప్రభాతవార్త**

మండలంలోని నందిరెడ్డిగారి పల్లిలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉర్దూలో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న 210 మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్. షాహీరా మరియు జఫ్రుల్లా బాషాలు సుమారు 20వేల రూపాయలు విలువ చేసే అభ్యసన సామాగ్రి అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలోఈ సామాగ్రిని మండల విద్యాశాఖ అధికారి ద్వారకానాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ. కే ద్వారకనాథ్ మాట్లాడుతూ ఇలాంటి సేవ గుణాలను మరియు అలవాట్లను ప్రతిఒక్క ఉపాధ్యాయుడు అలవర్చుకుంటే ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న ప్రతి పేద విద్యార్థులు మంచి విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్ ఖాన్, పి.ఎస్.హెచ్.ఎం. ఎస్. ఫర్హాతుల్లా, రిజ్వాన్ అహ్మద్, వారిస్ అహ్మద్, అజ్మతుల్లా, సిరాజుద్దీన్, జహీర్ ఖాన్, తాజ్ సుల్తాన్, వరలక్ష్మి, మరియు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం,

## సామాజిక చైతన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**రాయచోటి జులై 9 ప్రభాతవార్త**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు, రాయచోటి రూరల్ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ ఆధ్వర్యంలో పెమ్మాడపల్లి హరిజనవాడలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సామాజిక చైతన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాయచోటి అర్బన్ఎస్ఐ అబ్దుల్ జహీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలకు శక్తి యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా నమోదు చేసుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్‌ను ఎలా వినియోగించాలో వివరించారు. మహిళలు ఎలాంటి వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు లేదా ఇతర సమస్యలు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలు, డ్రగ్స్, గంజాయి, మద్యం, దుర్వినియోగం, సైబర్ మోసాలు, మహిళలపై వేధింపులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇటువంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మహిళ తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ మహిళలకు తక్షణ రక్షణ అందించడంలో కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మాట్లాడుతూ: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలు, కాలనీల స్థాయిలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటి మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను వినియోగించేలా ప్రోత్సహించాలని, యువత బాల్యవివాహాలు, డ్రగ్స్ తదితర సామాజిక దురాచారాలకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పోలీసు శాఖ చేపడుతున్న మహిళా భద్రత కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువత, కాలనీ ప్రజలు, పార్టీ నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలకు ఉచిత అన్నప్రసాదం



**బ్రహ్మంగారిమఠం, జూలై 09 ప్రభాతవార్త**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో గర్భిణీలకు ఉచిత అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణీలకు మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశాల మేరకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొంతకాలంగా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. దూర ప్రాంత గ్రామాల నుంచి ఆరోగ్య పరీక్షల కోసం వచ్చే గర్భిణీలు సమయానికి స్వగ్రామాలకు చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన మఠం యాజమాన్యం వారికి ఉచితంగా అన్నప్రసాదం అందజేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఈ సేవా కార్యక్రమంపై గర్భిణీలు హర్షం వ్యక్తం చేస్తూ మఠాధిపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్, హెల్త్ అసిస్టెంట్లు మాధవ, వెంకటరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మఠం సిబ్బంది కిరణ్, అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.60 వేలు ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

**నిమ్మనపల్లె జులై 9 ప్రభాతవార్త**

మండల పరిధి ముష్టూరు గ్రామంలో ఉన్న ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవస్వామి దేవస్థానానికి రూ.60,000/ లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ ఈఓ పి.రమణ తెలిపారు. గురువారం ముష్టూరులో చెన్నకేశవ స్వామి దేవస్థానానికి సంబంధించిన వ్యవసాయ భూములను కౌలుకు ఇవ్వడానికి దేవాదాయ శాఖ మదనపల్లి డివిజన్ పర్యవేక్షకులు ఎస్.శశి కుమార్, దేవాదాయ శాఖ అధికారులు రాజశేఖర్ లతో కలిసి బహిరంగ వేలంపాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెన్నకేశవస్వామి దేవస్థానానికి ముష్టురు గ్రామ పరిధిలో సుమారు 52 సర్వే నెంబర్లలో దాదాపు 20 ఎకరాలు భూమి ఉందన్నారు. మొదట విడతగా ఈ భూములను మూడు సంవత్సరాల పాటు కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలంపాటను నిర్వహించగా సుమారు 7 ఎకరాల భూమిని రూ.60 వేలకు రైతులు దక్కించుకున్నట్లు తెలిపారు. దీనితో వేలంపాట ద్వారా ఏడాదికి రూ.20 వేల చొప్పున మూడు ఏళ్లకు 60 వేల రూపాయలు ఆదాయం ఆలయానికి సమకూరిందన్నారు. వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. అలాగే చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన భూమిని పూర్తిగా సర్వే చేయించి, రెండవ విడతలో మిగిలిన భూములను కూడా వేలం వేయిస్తామని తెలిపారు. ఆలయ భూములను ఆక్రమించడం నేరమని, ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ బాల అంకన్న, ఆలయ అర్చకులు కృష్ణమాచారి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం



**మైదుకూరు, జులై 09, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డులో గల ప్రభుత్వ బాలికల వసతి గృహంలో వైద్యాధికారి డాక్టర్ సుమధుర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో హాస్టల్‌కు చెందిన 39 మంది విద్యార్థినులకు పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. అవసరమైన వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఈ సందర్భంగా డాక్టర్ సుమధుర మాట్లాడుతూ బాలికలకు కౌమార దశలో వచ్చే శారీరక మార్పుల గురించి వివరించారు. ఈ సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అంతేకాకుండా కౌమార దశలో బాలికలు ఎక్కువగా రక్తహీనత బారిన పడే అవకాశం ఉందని, దీన్ని నివారించడానికి ఐరన్ అధికంగా ఉండే ఆకుకూరలు, పండ్లు మరియు ఇతర ఆహార పదార్థాలను తమ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పరిదా బేగం, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్థిక ప్రొఫైలింగ్‌పై అధికారులకు శిక్షణ



**బద్వేలు, జులై 9, ప్రభాత వార్త ;**

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా నియోజకవర్గ ఆర్థిక ప్రొఫైలింగ్‌కు సంబంధించిన అధికారుల శిక్షణ కార్యక్రమం గురువారం బద్వేలు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిడిడిపి కింద జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బద్వేలు ఆర్డీవో ఎ. చంద్రమోహన్ మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గానికి సమగ్ర ఆర్థిక ప్రొఫైలింగ్ నిర్వహించడం అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కీలకమని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తే శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించి స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్లు డా. రహీస్, అర్ష్య, యశ్వంత్ నాయుడు నియోజకవర్గ ఆర్థిక ప్రొఫైలింగ్ లక్ష్యాలు, శాఖల వారీ డేటా సేకరణ, ప్రశ్నావళి పూరి, డేటా నాణ్యత, విశ్లేషణ, నివేదికల తయారీ తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. నిర్ణీత గడువులోగా నాణ్యమైన సమాచారాన్ని సమర్పించాలని సూచించారు. ఈ శిక్షణలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, విద్య, గణాంక, పరిశ్రమలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, డీడబ్ల్యూఎంఏ, వెలుగు, ఇరిగేషన్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై టీడీపీ సమీక్ష



**పులివెందుల, జులై 9, ప్రభాతవార్త :**

పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో వేముల మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేముల మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వేముల మండల టీడీపీ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన గడువులోగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చాగలేరు భాస్కర్ రెడ్డి, నాగభూషణ రెడ్డి, శివసాగర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి యాదవ్, భూషణ్ రెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ల జాబితాపై పరిశీలన

**దువ్వూరు, జులై 09, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోనూ అలాగే కృష్ణంపల్లె, కానగూడూరు తదితర గ్రామాల్లో సర్ ఓటర్ల జాబితాపై మండల స్థాయి అధికారులు పరిశీలించారు. దువ్వూరులో ఓటర్ల డిజిటలైజేషన్ తక్కువగా ఉండటంతో దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక సచివాలయంలో గురువారం బిఎల్ఓలు, రెవెన్యూ సిబ్బందిచే ఎంపీడీవో సుబ్బారెడ్డి, తాసిల్దారు సునీతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి ఎన్నికల సంఘం అందజేసిన దరఖాస్తు ఫారాలను అందజేసి దానిని తెచ్చుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓలపై ఉందన్నారు. దువ్వూరులో మందకోడిగా సాగుతుందని దీనిని వేగవంతం చేయాలన్నారు. అనంతరం కృష్ణంపల్లె, కానగూడూరు తదితర గ్రామాల్లో సర్ ఓటర్ల జాబితా పై జరుగుతున్న సర్వేను తాసిల్దార్ సునీత పరిశీలించి బి ఎల్ వో లకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగస్వరూప్, ఈఓపిఆర్డి హరికృష్ణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చైతన్యానికి ఆలయాలు కేంద్ర బిందువులు

### జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతా రెడ్డి

**పులివెందుల , జులై 9, ప్రభాతవార్త :**



నియోజకవర్గ పరిధిలోని సింహాద్రిపురం మండలంలోని ఇందిరమ్మ కాలనీలో నూతన శ్రీ సీతారామాలయ నిర్మాణానికి గురువారం వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తుల సమక్షంలో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ, శ్రీ సీతారాముల వారి ఆలయ నిర్మాణం గ్రామానికి శుభప్రదమైన పరిణామమన్నారు. ఆలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైత న్యాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి భక్తులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే, శ్రీ సీతారాముల వారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడ తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల శ్రీధర్ రెడ్డి, పీజీ గోపాల్ రెడ్డి, హుస్సేన్ పీరా, జాలరి మహేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 22 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు

**దువ్వూరు, జులై 09, ప్రభాతవార్త:**

దువ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన పథకం కింద 22 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సురేష్ బాబు, హేమలతలు తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకం కింద గర్భవతులకు నాణ్యమైన వైద్య పరీక్షలు అలాగే అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని దీని ద్వారా గర్భార్భవతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు, ఎక్స్ రే లు, స్కానింగ్ వంటి వాటిని నిర్వహించి ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే జిల్లెల్ల గ్రామంలో టీబీ వ్యాధి గుర్తింపు గాను 103 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పరికరం ద్వారా 2 నిమిషాలలోనే ఫలితం వస్తుందని, తక్షణం వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, వీరాంజనేయులు, రవికుమార్, బ్రహ్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డిప్యూటీ ఇంజనీర్‌గా సి.సురేష్ బాబు

**రాయచోటి జులై 9 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రాయచోటి పురపాలక సంఘంలో డిప్యూటీ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉండగా, ఆ పోస్టుకు సి.సురేష్ బాబు నియమితులైనట్లు రాయచోటి మున్సిపల్ కమిషనర్ పి.రమణారెడ్డి తెలిపారు సురేష్ బాబు ఈరోజు విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ పి.రమణారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు సమర్థవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందిస్తూ పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.